# పెళ్లిసందడి

వి. రంగరాజు

ఉదయం పదిన్నర గంటలయింది!

'సింహాద్రి బ్యాంక్'లో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. వివిధరకాల పనులమీద బ్యాంక్‌కి వచ్చిన వాళ్లతో ఆఫీసు కొత్త పెళ్లికూతురి ప్రసన్నవదనంలా కాంతులీనుతోంది.

బైక్‌ని పార్క్‌చేసిన అసిస్టెంట్ మేనేజర్ సుందరం అందర్నీ విష్‌చేసి ఛాంబర్ లోపలికెళ్లి కూర్చున్నాడు.

సరిగ్గా పదకొండున్నరకు 'మే ఐ కమిన్' అన్న కోయిల స్వరం వినిపించింది.

"ఎస్! కమిన్" అన్నాడు సుందరం.

"మీ బ్యాంక్‌లో నాపేరు మీద ఖాతా తెరవాలని వుందండీ" అని జారినపైటని సవరించుకోకుండా హొయలొలికిస్తూ చెప్పింది ఆమె.

"దానిదేముందీ? అప్లికేషన్ పూర్తిచేసి, ఫోటో జతచేసి ఐదువందలు డిపాజిట్ చేస్తే మీ ఖాతా ప్రారంభిస్తాం" అని చెప్పాడు సుందరం! తను చెప్పిన వాక్యంలో ఏదైనా డబుల్ మీనింగ్ వుందేమోనన్న సందేహం వచ్చిందతనికి!

ఎదురుగా కూర్చున్న లేడీ మార్లిన్‌మన్రో స్టయిల్‌లో వంపు తిరిగిన నడుముని దాచుకోకుండా, చీరకుచ్చిళ్లను క్రిందకు జార్చింది.

"నాపేరు వకుళ... నాకు ఏటిఎం కావాలి!" అంటూ భారంగా ఒళ్లు విరుచుకుంది.

ఈ రోజు నా శీలానికి ఏదో ప్రమాదం జరిగేలా వుంది అనుకుంటూ "ఫార్మాలిటీస్ పూర్తి చేస్తే పోస్ట్‌లో వస్తుంది" అన్నాడు సుందరం.

"ఏటిఎం అంటే ఎనీటైం మేరేజ్" అంటూ ముందుకి వంగిందామె!

* * *

'అమ్మా' అని చెవికోసిన మేకలా కేక వేశాడు సుందరం! నాకు అర్జెంట్‌గా పెళ్లిచేయమ్మా. లేకుంటే నా పాతివ్రత్యానికి భంగం కలిగితే, యిక నా గ్యారంటీ లేదు?

"ఏమైందిరా పిచ్చిసన్యాసి" బ్యాంక్‌లో జరిగిన సీన్ వివరించాడతను! "మేము ఎన్నిసంబంధాలు చూచినా, స్వతంత్రం పోతుందని కాదన్నావ్... ఐదెంకెల జీతగాడివి! సిక్స్ ప్యాక్ బాడీ వున్న హెర్కులస్‌లా వున్నావ్. ఏ వనితకైనా, నీ హృదయ ఫలకం మీద తలవాల్చి నిద్రించాలనే వుంటుంది".

యీ డైలాగ్ ఏ తెలుగు సీరియల్ నుంచి డౌన్‌లోడ్ చేసావ్? మరి నాపెళ్లి...? అంటూ టీవీలో రీప్లే చూపించినట్టు ప్రశ్నని తిరిగి

ప్రశ్నించాడు సుందరం.

* * *

'ఏవండీ! మీ అబ్బాయి రెండో పెళ్లి చేసుకుంటానంటున్నాడు"

"రెండో పెళ్లేమిటీ? నీ సెటైర్ మండిపోనూ'

"వాడి మొదటి పెళ్లాం బ్యాంక్ జాబ్. పాణిగ్రహణం కోసం నిగ్రహం కోల్పోయి, ఆగ్రహం వచ్చిన గ్రహంలా యిల్లంతా తిరుగుతున్నాడు. ఏం చేయనండీ?"

"వాడి ఫొటోని ఫాక్స్‌లో పంపించు! కట్నం త్యాగం చేసైనా పెళ్లిసంబంధం చూచి మ్యాచ్ ఫిక్సింగ్ చేస్తాను. ఈ హైద్రాబాద్ సిటీలో గంతకు తగిన బొంత దొరక్కపోతుందా?" అన్నాడు శారద భర్త.

* * *

ఆదివారం రావడంతో తీరిగ్గా న్యూస్ పేపరు చదువుతున్నాడు సుందరం. శారద కాఫీ కప్ సుందరానికి ఇచ్చింది.

'నీకొక గుడ్ న్యూస్ చెప్తాన్రా! మీ అంకుల్ గుర్నాధం కూతురు శైలజతో ఈ ఫ్రైడే నీ నిశ్చితార్థం... తాంబూలాలు మార్చుకుందాం.

సుందరం ఆనందంగా తలూపాడు.

"ఇపుడు నీకొక బ్యాడ్ న్యూస్ వినాలి"

"బ్యాడ్ న్యూస్ వినాలా?' సుందరం షాకయ్యాడు.

"ఈ మధ్య టీ.వీ.లలో చిత్రవిచిత్రమైన పద్ధతులలో ఆడవారు గృహహింసని అమలు చేస్తున్నారు. నా సలహాలు కొన్ని వినాలి నీవు"

'చెప్పమ్మా' అన్నాడు సుందరం.

"పాత డైరీలలోని పనికిరాని సమాచారమంతా చింపివేయాలి... అటకమీద పారవేసిన పాత ఖాళీ సీసాలన్నీ పారవేయాలి. నీ గురించి చెడువిషయాలు చెప్పి, మెప్పుకోసం తహతహలాడే స్నేహితులను దూరంగా వుంచాలి. పర్సనల్ కంప్యూటర్, సెల్‌ఫోన్‌లలోని రాంగ్ నెంబర్స్ / మెసేజ్‌లు డిలీట్ చేయాలి".

'ఇప్పటినుంచే నీ పథకాలన్నీ ఆచరిస్తానమ్మా' అని న్యూస్ పేపర్ మీద ప్రమాణం చేసాడు ఏ.ఎం. సుందరం...



శారదమ్మ కిచెన్ సెక్షన్‌లోకి వెళ్లిపోయింది.

పాత డైరీలన్నీ తిరగవేస్తూంటే... క్లోజ్‌ఫ్రెండ్ శరత్‌చంద్ర అడ్రస్‌తోపాటు ఫోన్ నెంబర్ సుందరానికి కనబడింది. ఆ డేటాని కొత్త డైరీలో వ్రాశాడు.

"హలో! నేను సుందర్రావ్, అసిస్టెంట్ మేనేజర్..."

"హాయ్ ఫ్రెండ్ - నేను శరత్‌చంద్ర, యాడ్ మేనేజర్. ప్లెజంట్ సర్‌ప్రైజ్... చాలాకాలం తర్వాత ఫోన్ చేశావు! ఏమిటి విశేషాలు?"

'జూన్ పదవ తేదీ హైద్రాబాద్ ఆర్య సమాజ్‌లో మా అంకుల్ గారి అమ్మాయి శైలజతో నా మేరేజ్ ఫిక్స్ అయిందిరా!"

"కంగ్రాచ్చులేషన్స్! నాదగ్గర వీడియో కెమెరా వుంది. నీ మేరేజ్ ఫంక్షన్ షూట్‌చేసి డీవీడీ ఇస్తాను. ఫీజ్ వద్దులే".

'అప్పట్లో నా గర్ల్ ఫ్రెండ్ నీలిమకి నేను వ్రాసిన ప్రేమలేఖ యిచ్చి చీవాట్లు తిన్నావ్. ఆ ఘటనకు యిది ప్రతిఘటనా?'

"అలాంటిదేమీలేదు - మీరు హైద్రాబాద్ రాగానే నాకు ఫోన్‌చేయండి. కంపెనీ కారు పంపించి, సూట్స్ బుక్‌చేస్తాను. మూడు రాత్రుల ఫంక్షన్ కూడా నేనే షూట్ చేయవచ్చా?"

"నా ఉడ్‌బీకి తెలిసిందంటే, నిన్ను రివాల్వర్‌తో షూట్‌చేసి, జనాభాలోంచి తప్పిస్తుంది".

"ఓకే ఫ్రెండ్-బై" అన్నాడు శరత్‌చంద్ర.

"వెధవ! శోభనం రాత్రులు కూడా వీడియోలో షూట్ చేస్తాడట!! కోహినూర్, డీలక్స్ నిరోధ్ ప్యాకెట్లను మేడారం జాతరలో జంపన్నవాగు దగ్గర అమ్ముకునే శాల్తీలావున్నాడు. అడల్ట్స్ ఓన్లీ చిత్రాల మధ్యలో బ్లూఫిలిం బిట్లు జోడించి ప్రదర్శించే కేసులా వున్నాడే" అంటూ శరత్‌చంద్రని తిట్టుకున్నాడు సుందరం.

* * *

కొరియర్‌లో సుందరానికి కవరింగ్ లెటర్ జతచేసిన డీవీడీ వచ్చింది. అటెండర్ అప్పా రావ్ ఐదు నిమిషాలలో ఆఫీసులో వారందరికీ వార్తాప్రసారం చేసేసాడు.

'నారికేశపాశాలనే యమపాశంలో చిక్కుకోని మృత్యుంజయుడిలా యింతకాలం బ్రతికావ్. నీ పెళ్లి భోజనంతో యీర్ష్యాసూయలనే క్షుద్బాధ తీరింది. ఆ డీవీడీ దర్శనం కూడా పూర్తయితే, క్రొత్త బ్రహ్మచారిని వెతికి మా సూటిపోటి మాటలతో హింసిస్తాం' అని మేనేజర్ నాటకీయంగా అన్నాడు.


సకుటుంబ సపరివార మిత్ర సహోద్యోగుల బృందంతో ఆశీనుడయ్యాడు సుందరం. టీవీలో 'పెళ్లి సందడి' ప్రారంభమయ్యింది. వధూవరుల బ్యానర్ మీద లైటింగ్...

'అన్ని రకముల హోర్డింగులకు సంప్రదించవలసిన చిరునామా... శంకర్, ఆర్టిస్ట్, హాబీస్ గూడా, హైద్రాబాద్...

ఆల్‌ఔట్, పారాచూట్, జెట్, ఐడియా ప్రకటనలు కన్పించాయి. పురోహితుడి గొంతు వినపడింది.

'మీ అంత్యక్రియలకు, శ్రాద్ధకర్మలకు, పిండ ప్రదాన - శాంతి హోమాలకు, దశదిన పితృవియోగ శౌచాలకు ఫోన్‌చేయక ఛస్తారా? అని సవినయంగా చెప్తున్నాను: లుబ్ధావధాని, రాజమండ్రి'. మరో పావుగంటసేపు కేర్‌ఫ్రీ, స్టేఫ్రీ, బజాజ్, హోండా యాడ్స్ పీడించాయి. తర్వాత దృశ్యం పెళ్లిమంటపానికి కట్టిన అరిటాకుల మీద ప్రసరించింది.

'అన్నిరకాల పెళ్లి, తద్దిన భోజనాలకు ఎస్.ఎం.ఎస్. అరిటాకులనే వాడండి.' కొత్త టీ.వీ. సీరియల్స్, సినిమాల అడ్వర్‌టైజ్‌మెం




ట్లతో యిరవై నిమిషాల కాలం గడిచింది. ప్రేక్ష కుల వీక్షణం తీక్షణమైంది.

'ఇది నీ పెళ్లి క్యాసెట్ కాదేమో?'

యాడ్ వాళ్ల దగ్గర బాగా గిట్టుబాటైనట్టుంది. 'టెలివిజన్ నెట్‌వర్క్‌లో ముదిరినట్లున్నాడు.'

రకరకాల వ్యాఖ్యానాలతో నిరసన ధ్వనులు ప్రేక్షకులను దాటాయి. ఐదునిమిషాలపాటు సుందరం-శైలజలపెళ్లి సీన్లు కనిపించాయి. టీవీలో చెంబులోని కొబ్బరికాయకు కట్టిన తాళిబొట్టు, జీలకర్ర-బెల్లం కనిపించాయి.

"స్వచ్ఛమైన 916 కేడియం బంగారానికి విచ్చేయండి ఛార్లెస్ శోభరాజ్ జ్యూయలర్స్, చోర్‌బజార్, ఢిల్లీ".

'కల్తీలేని బెల్లం కోసం డి.డి. పంపవలసిన అడ్రస్ ఇదే 'లోభిశెట్టి కిరాణా, తాడేపల్లిగూడెం' మళ్లీ ప్రకటనల ప్రవాసనం మొదలైంది. ఇమేజ్ హాస్పిటల్స్, కలర్ లాబ్స్, మిస్సింగ్ పర్సన్స్, గవర్నమెంట్ ప్రోగ్రామ్స్ నరఘోష చేసాయి.

"ఒరేయ్ సుందరం - ఇక మావల్ల కాదు రా! మా వల్లకాదుకి పిలుపువచ్చేలా వుంది. కనీసం నీ షష్ఠిపూర్తి కార్యమైనా సక్రమంగా చూసే భాగ్యం కలిగించు" అని వచ్చినవాళ్లంతా గొణుక్కుంటూ వెళ్లిపోయారు.

* * *

సెల్‌ఫోన్ అందుకున్నాడు సుందరం. శరత్ చంద్ర నంబర్‌ని డయల్ చేసాడు. "హాయ్ సుందర్! డీవీడీ చేరిందా? నేను నీ పెళ్లి బాగా కవర్ చేసాను కదూ! ఇంకెవరయినా బ్యాచిలర్స్ ఫోన్ నంబర్స్ ఇవ్వు. నీ పెళ్లితంతు యింకా వుంటే కోకోకోలా, థమ్స్‌అప్, పెప్సి, డిష్‌టీవీ, టాటాస్కై యాడ్స్ యిచ్చేవాడినోయ్. నీవాటా సొమ్ము ఆన్‌లైన్‌లో పంపిస్తానులే" అని చెప్పసాగాడు శరత్‌చంద్ర.

'ఒరేయ్! నిన్ను అర్జెంట్‌గా ఖతం చేయడానికి ఎయిర్ టికెట్ బుక్ చేసుకున్నాను. మరో మూడు గంటలలో నువ్వు ఫినిష్"కోపంగా అన్నాడు సుందరం.